

ఊరికి దూరంగా సాలెవాడ(బి) పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం



ఆశ్రమ పాఠశాల వద్ద లక్షెట్టిపేట పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

● జిల్లాలో నిరుపయోగంగా మారిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ● రూ.లక్షల ప్రజాధనం వృధా!! ● ప్రాంగణాలను ఉపయోగంలోకి తేవాలని కోరుతున్న స్థానిక ప్రజలు

ఉట్నూర్, జూలై 7: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని విడుదల చేసిన నిధులు వృధా కాగా, గ్రామాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు, బోర్డులు అలంకారప్రాయంగా మిగిలాయి. 'తల్లి ఏడిస్తే, బిడ్డ ఏడ్చింది' అన్న చందంగా ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లా అధికారుల సూచనల మేరకు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు ఎక్కడబడితే అక్కడ పనికిరాని ప్రదేశాల్లో క్రీడా ప్రాంగణాల బోర్డులు ఏర్పాటు చేసి చేతులుదులుపుకున్నారు. లక్షెటిపేట గ్రామంలోని గ్రామ పంచాయతీ అధికారులు గ్రామంలో ఉన్న గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రహరిగోడకు క్రీడ ప్రాంగణం బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. షాంపూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బోరిలాల్‌గూడ ప్రాంతంలో,సాలెవాడ(బి) పంచాయతీ అధికారులు పనికిరాని ప్రదేశంలో క్రీడాప్రాంగణం పేరుతో బోర్డులు ఏర్పాటు చేశారు. అక్కడ క్రీడలు ఆడుతున్నారా? అంటే అది ఏమీ లేదు. అధికారులు ఆదేశించారు కదా అంటూ.. ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు ఖర్చు చేశారు. ఇదే తరహాలో ఉట్నూర్ మండలంలో ఉన్న 37 గ్రామ పంచాయతీలలో కూడా బోర్డులు పెట్టి మమ అనిపించుకున్నారు. ఒక ఉట్నూర్ మండలంలోని 37 పంచాయతీలకు క్రీడా ప్రాంగణాల ఏర్పాటు కోసం ఒక్కొక్క పంచాయతీకి ప్రభుత్వం రూ.30వేలు కేటాయించగా.. 37 పంచాయతీలకు రూ.11.10 లక్షలను వెచ్చించారు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతో పాటు గ్రామీణ క్రీడాకారులకు దుస్తువులు, క్రీడల కిట్లు, బార్ పరికరాలు తదితర వస్తువులు కూడా కేటాయించినప్పటికి క్రీడల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రభుత్వ ఆశయాలు నెరవేరేలా ప్రజా నిధులు వ్యయం చేయాలని ప్రజలు అంటున్నారు.



● పనికి రాని ప్రదేశంలో బోరిలాల్‌గూడ వద్ద షాంపూర్ పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు



సోయంగూడలో అకాడి పూజలు చేస్తున్న గ్రామస్థులు

ఆదివాసీ గూడల్లో అకాడిపేన్ పూజలు

గుడిహత్నూర్, జూలై 7: మండలంలోని ఆదివాసీ గూడల్లో అకాడిపేన్ పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామ సమీపంలోకి వెళ్లి దేవతలకు పూజలు నిర్వహించారు. అనంతరం అందరూ కలిసి సామూహిక భోజనాలు చేశారు. ప్రకృతిని ప్రేమించడం, ఆరాధించడం ఆదివాసీ గిరిజనుల సంస్కృతిలో భాగం. అందులో భాగంగా వర్షాకాలంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అకాడి పూజలు చేయడం వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని, పశువులకు, పశువుల కాపరులకు అటవీ జంతువులు ఎలాంటి హానీ తలపెట్టవద్దని కోరుతూ ఈ పూజలు చేశామని స్థానిక ఆదివాసీలు తెలిపారు.



కుంటాల జలపాతం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ

జలపాతం వద్ద రక్షణ చర్యలు చేపట్టండి

● ఏఎస్పీ సురేందర్‌రావు

నేరడిగొండ, జూలై 7: కుంటాల జలపాతం వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని ఏఎస్పీ సురేందర్‌రావు అన్నారు. ఆదివారం కుంటాల జలపాతాన్ని ఆయన డీఎస్పీ నాగేంద్రతో కలిసి సందర్శించి జలపాతం అందాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున పర్యాటకుల తాకిడి పెరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఈ సంద్భంగా ఆయన పేర్కొన్నారు. అడవుల సంరక్షణ బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. జలపాతాన్ని తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతీఒక్కరు తమవంతుగా మొక్కలను నాటాలన్నారు. ఆయన వెంట ఇచ్చోడ సీఐ భీమేష్, ఏఎస్సై మారుతి, ఎఫ్ఎస్‌వో వసంత్ కుమార్, ఎఫ్‌బీవో సచిన్, తదితరులు పాల్గొన్నారు.



ధ్రువ పత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

రెండో రోజు కొనసాగిన ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్

ఆదిలాబాద్ రూరల్, జూలై 7: జిల్లాకేంద్రంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్ లైన్ కౌన్సెలింగ్ కేంద్రంలో ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులకు టీజీ ఈఏపీసీఈటీ ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం ధ్రువపత్రాల పరిశీలన రెండవ రోజు కొనసాగింది. 280 అభ్యర్థులు స్లాట్ బుక్ చేసుకోగా 231 అభ్యర్థులు హాజరయ్యారు. ధ్రువపత్రాల పరిశీలన సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని ప్రిన్సిపల్, కోఆర్డినేటర్ కె.వీరస్వామి తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ రాజన్న, సిస్టం అనలిస్ట్ సుజయ్, అధ్యాపకులు నర్సయ్య, శ్రీనివాస్, ప్రవీన్, సురేష్, హేమలత, సుధాకర్, సంజయ్ సింగ్, సంతోష్, శ్రీనివాస్, ఎజాజ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం



రైతు వేదిక వద్ద ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

పిచ్చిమొక్కలను తొలగించరూ!

బోథ్, జూలై 7: మండలంలోని కౌటా(బి) గ్రామంలో ఉన్న రైతు వేదిక చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో ఆ ప్రాంతంలో విష కీటకాలు సంచరిస్తున్నాయి. రైతు వేదిక పక్కనే పాఠశాల ఉండటంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు పిచ్చిమొక్కలను, ముళ్ల పొదాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

చెక్ డ్యామ్‌ను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

బోథ్, జూలై 7: మండలంలోని పెద్దవాగుపైన నిర్మించిన చెక్ డ్యామ్ వద్ద 'కొట్టుకుపోయిన రిపీట్‌మెంట్' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈ భీమ్‌రావు, ఏఈ ప్రకాష్‌లు ఆదివారం సందర్శించారు. కొట్టుకుపోయిన రిపీట్‌మెంట్ శాఖ పరంగా నిర్మించింది కాదని, కేవలం రైతు తన పంట పొలంలోకి నీరు వెళ్లకుండా ఏర్పాటు చేసుకున్నాడని, రిపీట్‌మెంట్ రికార్డుల్లో లేదని వివరించారు.

'నెల రోజులుగా గుడ్‌బిలో విద్యుత్ అంతరాయం'

భీంపూర్, జూలై 7: మండలం మారుమూల సరిహద్దు గ్రామం అయినా గుబడ్‌డిలో నెల రోజుల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. రోజులో ఒక గంట విద్యుత్ ఉంచుతూ రెండు గంటలు తీస్తున్నారని చెబుతున్నారు. తమ గ్రామంలో విద్యుత్ సమస్య గురించి అధికారులకు ఎన్నిసార్లు తమ గోడు వెళ్ల బోసుకున్నా.. పట్టించుకునే నాథుడే లేరని అధికారుల తీరు పట్ల మండిపడుతున్నారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకనే నానా అవస్థలు పడుతుంటే మరో పక్క ఇప్పుడు విద్యుత్ సమస్యతో సతమతమవుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయంతో చీకటిలోనే కాలం వెళ్ల దీయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మావల, జూలై 7: సుదీర్ఘ కాలంగా మావల గ్రామంలో విధులు నిర్వహించి బదిలీలలో భాగంగా వేరే గ్రామానికి బదిలీ అయిన సందర్భంగా ఉపాధ్యాయులు రామగిరి కుమార్, కుశాల్ జాడేలను గ్రామస్థులు సన్మానించి వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామస్థుల అప్యాయత పట్ల భావోద్వేగానికి లోనయ్యారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద్, యాసం నర్సింగ్‌రావు, యూనిస్, అక్బానీ, మాజీ జడ్పీటీసీ నల్ల రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ ఉమాకాంత్ రెడ్డి, హెచ్‌ఎం అట్ల విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

గోండి భాష అభివృద్ధికి కృషి చేస్తా

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా ● జడ్పీ సమావేశ మందిరంలో 'పండోక్న మహాభారత్' పుస్తకావిష్కరణ ● పాల్గొన్న తోటి తెగల నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 7: గోండి భాషా అభివృద్ధికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తనవంతుగా కృషి చేస్తానని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. తొడసం కైలాస్ గోండి భాషలో రచించిన పండోక్న మహాభారత్ కథ పుస్తకావిష్కరణను ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ కళాకారిణి మర్సుకోల కళావతి మహాభారతంలో పాండవుల జననం గురించి గోండి భాషలో పాట రూపంలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ భాష పై అభిమానంతో తొడసం కైలాస్ మహాభారతం గోండులకు తెలియాలని గోండి భాషలో రచించడం అభినందనీయమన్నారు.భాష అభివృద్ధికి ఆర్థికసాయం కావాలని నాయకులు, రచయిత కైలాస్ కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గర్భిణులు అధికంగా రక్తహీనతతో బాధపడుతున్నారని, దీనిపై అవగాహన కల్పించి పౌష్టిక ఆహారం తీసుకునేలా ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సుగుణ, మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, రచయిత మేస్రం మనోహర్, తొడసం చందు, గోండి, కోలాం, తోటి తెగల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఎస్సీ రిజర్వేషన్‌ల కోసం పోరాటం

● ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ ● జిల్లావ్యాప్తంగా ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ● పాల్గొన్న నాయకులు



ఇచ్చోడలో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు



బోథ్ బస్టాండ్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగుర వేస్తున్న నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 7: మాదిగల అభ్యున్నతితో పాటు రిజర్వేషన్ల సాధన కోసం 30ఏళ్ల క్రితం 18మందితో ప్రకాశం జిల్లా ఈదుమూడిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ అన్నారు. అప్పటి నుంచి అనేక పోరాటాలు చేస్తూ హక్కుల సాధన దిశగా సాగుతోందన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవంతో పాటు వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ముందుగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి మందకృష్ణ మాదిగకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ కోసం బలంగా పోరాటం చేస్తునే బాధ్యతగల సంఘంగా ఇతర సమస్యలపై కూడా ఉద్యమిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ పథకం, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్‌తో పాటు పీడిత వర్గాల కోసం పోరాటం చేశామన్నారు. అన్ని వర్గాలను చైతన్య పరిచి హక్కుల సాధన దిశగా సాగామని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణయే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, మనోజ్, గణేష్, శంకర్, గంగయ్య, రాములు, విద్యాసాగర్, ఎల్లన్న, రవి, ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.



గుడిహత్నూర్‌లో వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఇచ్చోడ: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం మండల కేంద్రంలోని అడేగామ కాలనీలోని అంబేద్కర్ కూడలి సమీపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్ మాదిగ, నాయకులు చిట్టి రవి, గంగన్న, ఎర్రయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భవించి 30 సంవత్సరాలు కావడంతో మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ 30సంవత్సరాల కాలంలో ఎమ్మార్పీఎస్ ఎన్నో ఉద్యమాలు చేసి విజయం సాధించిందన్నారు. మాదిగ ఉప కులాలకు 15 శాతం రిజర్వేషన్లు సమాన పంపిణీ జరగాలని చేస్తున్న పోరాటమే ఎమ్మార్పీఎస్ ఉద్యమం అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గ ప్రజలపై దాడులు జరిగితే సత్వరమే న్యాయం జరగాలని ఎమ్మార్పీఎస్ ఉద్యమం చేసిందన్నారు. ఫలితంగా జిల్లాలలో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రవి మాదిగ, అశోక్, ప్రసాద్, గోపి, నల్ల సాయి, బిక్క అశోక్, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. దండోరా జెండా ఎగురవేసి ఎమ్మార్పీఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిందన్నారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. బహుజన నాయకుడిగా అనేక ఉద్యమాలు చేసి పేదల పక్షాన నిలిచాడన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగు గంగయ్య, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రేమ్‌రాజ్, ఎమ్మార్పీఎస్ నాయకులు రంచాల లక్ష్మణ్, విజయ్‌కుమార్, బాలాజీ, ముండే గోకుల్, కమలాకర్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

● 'ఎమ్మార్పీఎస్ ఉద్యమంతోనే మాదిగలకు గుర్తింపు'

ఇంద్రవెల్లి: ఎమ్మార్పీఎస్ ఉద్యమంతోనే మాదిగలకు గుర్తింపు వచ్చిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ మాదిగ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో 30వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలతో పాటు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆ సంఘం జెండాను ఆవిష్కరించి ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు లెక్క చేయకుండా పోరాడిన అమరులకు నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేక్‌ను కట్ చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు లెక్క చేయకుండా పోరాడిన అమరులకు నివాళులర్పించడం మాదిగ సమాజాన్ని గౌరవించుకోవడమే అని వారి ఖ్యాతి మాదిగ జాతి మరువద్దన్నారు. మాదిగ దండోరా ఉద్యమం 30 ఏళ్లు పూర్తి చేసుకుని 31లోకి అడుగు పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అరెల్లి రాజలింగు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉప్పరి డేవిడ్ మాదిగ, సూర్యవంశీ, శంభు మాదిగ, లింగంపల్లి రాజన్న మాదిగ, నర్సయ్య మాదిగ, రాజేంద్ర మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో మిట్టరాజు, నలిగంటి రాజు, చిర్ర స్వామి, గజ్జల నగేష్, నంది, రాము, చుంచు ప్రవీణ్, వడ్లూరు గంగాధర్, నలిగంటి ధర్మన్న, గజ్జల నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లిలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఘనంగా బోనాల పండుగ

● తొలి బోనం సమర్పించిన ఆయా కుల సంఘాలు ● ఆలయాలకు పోటెత్తిన భక్తులు


ఆదర్శనగర్‌లో ఆషాఢ బోనమెత్తిన మహిళలు


బోనాలతో శోభాయాత్ర

నిర్మల్ కల్చరల్, జూలై 7: ఆషాఢ మాసం ఆరంభం కావడంతో ఆదివారం నిర్మల్ పట్టణం బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి కురుమ జాగృతి, సంక్షేమ సంఘం తొలి బోనం సమర్పించింది. ప్రతీ ఏటా తొలిఆషాఢ బోనాన్ని కురుమసంఘం సమర్పించడం ఆనవాయితీ. మట్టి కుండలో బోనం వండుకొని అమ్మవారికి మహిళలు నైవేద్యాన్ని సమర్పించారు. ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. వ ర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కో రుతున్నారు. జాగృతి అధ్యక్షుడు బూసారపు గంగాధర్, కే.రఘు, శ్రీనివాస్, నగేష్, శిలారి లక్ష్మీ, లలిత, నాగలక్ష్మి, సుశీల, మహిళలు పాల్గొన్నారు.

● సాంగ్వీలో ఘనంగా బోనాల పండుగ

దిలావర్‌పూర్: మండంలోని సాంగ్వీలో ఆదివారం బోనాల పండుగను ఘ నంగా నిర్వహించారు. ఆషాఢమాసం మొదటి ఆదివారం పురస్కరించుకొని గ్రామానికి చెందిన మహిళలు బోనాలెత్తుకుని గ్రామ ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శివసత్తుల నాట్యం, పోతరాజు ల విన్యాసాల మధ్య శోభాయాత్ర కొనసాగింది. అనం తరం గంగ పోచమ్మ అమ్మవారికి, గంగామాతకు, గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

● మహాలక్ష్మి అమ్మవారికి ఆర్యవైశ్యుల ఆషాఢ బోనాలు

నిర్మల్ కల్చరల్: నిర్మల్ ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మ హాలక్ష్మి అమ్మవారికి ఆషాఢ బోనాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నుండి బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి బోనం సమర్పించారు. అక్కడి నుంచి చిలువేరి భవనానికి చేరుకున్నారు. భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అమ్మవారు అందరినీ చల్లంగా చూడాలని ప్రార్థించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

● సింగాపూర్ పెద్దమ్మతల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ పెద్దమ్మ తల్లి ఆలయానికి ఆదివా రం భక్తులు పోటెత్తారు. ప్రతీ ఏడాది వర్షాకాలం ఆరంభంలో అమ్మవారికి ఈ ప్రాంతప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి వ్యవసాయ క్షేత్రాలలో పంట లను వేసుకుంటారు. ఇందులో భాగంగానే మృగశిర కార్తె ఆరంభమైన నుంచి ఇప్పటివరకు నిత్యం సింగాపూర్ పెద్దమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం సైతం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భం గా ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అ ధ్యక్షుడు దొనికెని దయానంద్, ఖానాపూర్ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు తోట సత్యం, పెంబి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సభ్యులు స్వప్నిల్ రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్, కాంగ్రెస్ నాయకులు జన్నారపు శంకర్, మ్యాదరి రాజేశ్వర్, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా భక్తుల రాకతో ఆలయ చుట్టూ పరిసరప్రాంతాలన్నీ రద్దీగామారాయి. పచ్చనిచెట్ల నడుమ దర్శనమి చ్చే అమ్మవారి ఆలయం భక్తజన సందోహంతో సందడిగా కనిపించింది.

● ఆదర్శనగర్ శివాలయంలో ఆషాఢ బోనం

నిర్మల్ కల్చరల్: పట్టణంలోని ఆదర్శనగర్ శివాలయంలో ఆదివారం ఆషా ఢ బోనాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పురవీధుల్లో బోనాలతో శివా లయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. పూజారి సాయన్న ఆధ్వర్యంలో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య బోనాలు సమర్పించారు.

● భక్తిశ్రద్ధలతో బోనాలు

భైంసా: పట్టణంలోని పోచమ్మ, మైసమ్మ క్షేత్రాలు ఆదివారం మహిళా భ క్తులతో కిక్కిరిసిపోయాయి. బోనాల సమర్పణకు మహిళలు, యువతులు పోటెత్తారు, వేకువజాము వేళ నుంచి ఆలయాలకు భక్తుల తాకిడి మొదలలైంది. రెండు ఆలయాల్లో మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టి ఉదయం వేళలో చలి బోనాలను, మధ్యాహ్నంవేళలో వేడిబోనాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కుటుంబ సభ్యులు అంతా ఆయురారోగ్యాలతో ఉండాలని సమృద్ధిగా, వర్షాలు కురవాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని ప్రజలు పూజలు చేశారు.


ఆషాఢ బోనం సమర్పిస్తున్న కురుమ సంఘం


సాంగ్వీలో బోనాలతో శోభాయాత్ర నిర్వహిస్తూ..


భైంసాలో పోచమ్మ ఆలయంలో కిక్కిరిసిన భక్తులు


కోలాంగూడలో జీఎల్‌ఎస్‌ఆర్ పథకం ట్యాంకు

పని చేయని పథకం.. మంచినీటి కోసం కష్టం!

ఉట్నూర్, జూలై 7: మండలంలోని శాంపూర్ కోలాంగూడ ప్రభుత్వం నిర్మించిన జీఎల్‌ఎస్‌ఆర్ పథకం పని చేయకపోవడంతో మంచినీటి కష్టాలు ఎదురవు తున్నాయని కోలాం గిరిజనులు పేర్కొంటున్నారు. మంచినీటి సౌకర్యం లేక పోవడంతో తాగునీటి కోసం చాలా ఇబ్బందిగా ఉందని గిరిజనులు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వెంటనే తమ గ్రామంలో ఉన్న మంచినీటి పథకానికి మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


గుట్టగూడలో గిరిజనులతో మాట్లాడుతున్న జైవంతరావు

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఉట్నూర్, జూలై7: వానాకాలం వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండలంలోని చప్రాల గుట్టగూడ గిరిజన గ్రామాన్ని సందర్శించి గిరిజనులతో మాట్లాడారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇండ్ల పరిసరాలలో కూడా మురికి నీరు ఉండకుండా చూసుకోవాలని కోరారు. వానలు కురిసినప్పుడు మురికినీటి గుంటలో నీరునిల్వ ఉన్నట్లయితే దోమలు వృద్ధిచెంది మలేరియా, డెంగ్యూలాంటి వ్యాధులు సంక్రమి స్తాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ భీమ్‌రావు, నాగరావు లచ్చు, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్యశ్రీ శిబిరానికి విశేష స్పందన

నేరడిగొండ, జూలై 7: మండలంలోని బుగ్గారాం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య శ్రీ శిబిరానికి విశేష స్పందన లభించింది.ఆడే సకారాం స్మారకార్థం వారి కుమారుడు డా.క్రాంతికుమార్ ఆడే శ్రీకృష్ణ హాస్పిటల్ ఆదిలాబాద్ వారి ఆధ్వర్యంలో బుగ్గారంలో ఉచిత వైద్య శబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ వైద్య శిబిరానికి సుమారు 500 నుంచి 600 మందికి ఉచిత వైద్యం అందించారు. ఈ శిబిరంలో ఆసుపత్రి సిబ్బంది మేనేజర్ విజయ్, గణేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తాం: సీపీఐ

ఆదిలాబాద్ అర్బన్, జూలై 7: ప్రజా సమస్యలపై సీపీఐ తరపున అలుపెరగని పోరాటాలు చేస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇందులో నాయకులు, తదితరులున్నారు.

కుమ్మరి సంఘం కార్యవర్గం

నిర్మల్ కల్చరల్, జూలై 7 : నిర్మల్ పట్టణ కుమ్మరి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కొత్తపల్లి రఘు, సహ అధ్యక్షుడిగా పోతుగంటి స్వామి, ప్రధాన కార్యదర్శిగా పోతుగంటి సతీష్, కోశాధికారిగా తోడిశెట్టి శ్రీనివాస్ ఎన్నిక కాగా ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన క్లాస్‌మేట్స్

లక్ష్మణచాంద, జూలై7: మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన మృ తుడు రాజేందర్ (28) కుటుంబానికి తోటి క్లాస్‌మేట్స్ అండగా నిలిచారు. రూ.20వేలకు ఆర్థిక సహాయం చేసి బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. రాజేందర్ కొద్దిరోజుల క్రితం ఆత్మహత్య చేసుకోగా.. ఈ విషయం తెలుసు కున్న 2008-09 బ్యాచ్‌కు చెందిన 7వ తరగతి స్నేహితులు పి.రాజ్ కుమార్, గణేష్, ఎం.రాకేష్, బి. రాకేష్, ఇతర మిత్రులుపై ఆర్థికసహాయం చేశారు. కష్టాలుంటే స్నేహితులతో చెప్పుకుని పరిష్కరించుకోవాలే గాని ఇలా ఆత్మ హత్య చేసుకోవద్దని పేర్కొన్నారు. స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన యువకులను పలువురు అభినందించారు.


ఎంపీ, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వీఆర్వోల సమస్యలను పరిష్కరించాలి

● తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం

ఆదిలాబాద్ అర్బన్, జూలై 7: రెవెన్యూ శాఖ నుంచి వేర్వేరు శాఖల్లోకి బదిలీ చేసిన పూర్వ వీఆర్వోల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటి కోరారు. ఆదివారం తమ సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్‌లకు వినతిపత్రం అందించారు. వీఆర్వోల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకటి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 1998 నుంచి రెవెన్యూ శాఖలో వేర్వేరు పేర్లతో వీఆర్వోస్‌గా పని చేస్తున్నామన్నారు. ప్రజలకు-ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచిన తమను గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'తెలంగాణ వీఆర్వో వ్యవస్థ రద్దు చట్టం 2020' ద్వారా ఏకపక్షంగా రద్దు చేసిందన్నారు. ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నం 121 23-07-2022 ద్వారా రీడెప్లాయిమెంట్ పేరుతో 01-08-2022న 5576 మందిని లాటరీ ద్వారా బలవంతంగా బదిలీ చేసిందని పేర్కొన్నారు. దీంతో తాము సర్వీస్ మ్యాటర్ సంబంధ సమస్యలు, ఉద్యోగ హక్కుల ఉల్లంఘటనలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. మా వేతనం నుంచి జీపీఎఫ్, సీపీఎస్, టీఎస్‌జీఎల్ఐ చందా చెల్లింపులు నిలిచి పోయాయని, కొన్ని చోట్ల మా వేతనాల నుంచి చందా చెల్లింపులు మినహాయిస్తున్నా- వాటి జమ వివరాలు తెలువడం లేదన్నారు. ఇందులో రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనసూయ, అహల్య, అరుణ్, నారాయణ, హనీష్, దేవరావు, వినాయక్, పురుషోత్తం, శివమూర్తి, షఫీ, తదితరులున్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్ : ఎమ్మెల్యే

ఉట్నూర్, జూలై 7: పేద మధ్య తరగతి ప్రజలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఒక వరమని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం హైదరా బాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఎం.రాజేశ్‌కు సీఎంఆర్ఎఫ్ తక్షణ సహాయ నిధి నుంచిరూ.2.50 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపరేషన్‌కు రూ.లక్షల్లో వైద్యం చేసుకోలేక పోతున్న పేదప్రజలకు సీఎంఆర్ఎఫ్ సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పేద ప్రజల వైద్యానికి ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్న సర్కారు తమదని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు.

ఎంపీని కలిసిన తుడందెబ్బ నేతలు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 7: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌ను జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు బాపురావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎంపీ గోడం నగేష్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరగా దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఇందులో సంఘం సీనియర్ నాయకుడు సీతారాం, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

'మంత్రిగా జిల్లాకు రామచంద్రారెడ్డి చేసిన సేవలు మరువలేనివి'

బోథ్, జూలై7: జిల్లా మంత్రిగా దివంగత రామచంద్రారెడ్డి చేసిన సేవలు జిల్లా ప్రజలు మరిచిపోలేరని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం సీఆర్ఆర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని బోథ్ బస్టాండ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదిలాబాద్ జిల్లాకు రిమ్స్ ఆసుపత్రి, సాత్నాల ప్రాజెక్టు, మత్తడివాగు ప్రాజెక్టు తీసుకు రావడం జరిగిందని గుర్తు చేశారు. మారుమూల గ్రామాలకు రోడ్ల వసతిని కల్పించడం జరిగిందన్నారు. వెనుకబడిన జిల్లాను ముందుకు తీసుకురావడంలో ఆయన పాత్ర ఎంతగానో ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కురుమే మహేందర్, మైనారిటీ మండల అధ్యక్షులు మహ్మద్, నాయకులు లింగారెడ్డి, గంగారాం, రమేష్, శేఖర్, తదితరులు ఉన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

● రుయ్యాడిలో మాజీ జడ్పీటీసీ, ఎంపీపీలకు ఘనంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం

తలమడుగు, జూలై 7: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో గ్రామస్థులు, గ్రామ ప్రజలు అభిమానులు కలిసి తలమడుగు మండల మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్‌లకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ హాజరై ప్రసంగించారు. ముందుగా సన్మాన గ్రహీతలకు గ్రామ ప్రజలు, అతిథులు శాలువాలతో సన్మానించి మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ గత 30ఏళ్ల నుంచి గోక గణేష్‌రెడ్డితో తనకు రాజకీయ అనుబంధం ఉందన్నారు. గోక గణేష్‌రెడ్డి అంటే పేద ప్రజల మనిషిని జిల్లావ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడని అన్నారు. తప్పకుండా ఇదే స్ఫూర్తితో రాష్ట్ర స్థాయి వరకు పదవులను అధిరోహించాలని, పేద ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి ప్రతిపక్షంలో ఉన్న జడ్పీటీసీ, ఎంపీటీసీలు రామలక్ష్మణుల్లాగా కలిసిమెలిసి మండల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. జడ్పీటీసీ గణేష్‌రెడ్డి ఎప్పుడు మండల అభివృద్ధి కోసమే తనతో ఎక్కువ చర్చించేవారని అన్నారు. మొన్న తనకు వచ్చిన ఈజీఎస్ నిధులు ఏడు కోట్ల నిధులలో మండలానికి రెండు కోట్లు ఇవ్వాలని మొండి పట్టు పట్టి మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను జడ్పీటీసీ ఆధ్వర్యంలో పూర్తి చేయడం జరిగిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మీరాజేశ్వర్, మాజీ వైస్ ఎంపీపీ దివ్య మాధవ్, ఎంపీటీసీలు సుస్మిత, గోదావరి, సీనియర్ నాయకులు ప్రకాష్‌రావు, మాజీ సర్పంచ్ పోతారెడ్డి, బిట్ల గంగన్న, సాంబశివ్, గ్రామస్థులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

● అందరి సహకారంతో ఈ స్థాయికి: మాజీ జడ్పీటీసీ గణేష్‌రెడ్డి

కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతోనే రాజకీయంగా ఈ స్థాయికి వచ్చానని మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. గత 30 సంవత్సరాల నుంచి రాజకీయాల్లో రాణిస్తూ నిరంతరం ప్రజా సేవ చేస్తూ ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకోవడం జరుగుతుందన్నారు. శ్వాస ఉన్నంత వరకు ప్రజా సేవయే జీవిత ఆశయమని పేర్కొన్నారు.


జడ్పీటీసీ దంపతులను సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ గ్రామస్తులు

ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం

● జైనథ్ మండలంలో కొట్టుకుపోయిన తర్నం తాత్కాలిక బ్రిడ్జి ● రెండు మండలాలకు నిలిచిపోయిన రాకపోకలు


తర్నం వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక బ్రిడ్జి


బ్రిడ్జి వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్ రూరల్, జూలై 7: ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. ఆదివారం జిల్లా సాధారణ వర్షపాతం 6.6 మిల్లీ మీటర్లు కాగా అత్యధికంగా 41.9 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. అధికంగా ఆదిలాబాద్ అర్బన్‌లో రికార్డ్ స్థాయిలో 123 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఈ సీజన్‌లో అత్యధిక వర్షపాతం నమోదు కావడం ఇదే మొదటి సారి. అలాగే తాంసి మండలంలో 99.5, ఆదిలాబాద్ రూరల్ మండలంలో 78.8, తలమడుగు మండలంలో 70.5, మావల మండలంలో 61.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి వాగులు వంకలు పొంగి ప్రవహించడతో జైనథ్ మండలం సాత్నాల వాగుపై తర్నం వద్ద తాత్కాలికంగా నిర్మించిన బ్రిడ్జి వరద నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో జైనథ్, బేల మండలాలతో పాటు మహారాష్ట్ర నుంచి వచ్చిపోయే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

● ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చర్యలు : ఏఎస్పీ

జైనథ్: మండలంలోని తరోడ(బి) తర్నం వంతెన వద్ద తాత్కాలిక వంతెన శనివారం కురిసిన భారీ వర్షంతో వరదకు కొట్టుకుపోవడంతో ఆదివారం ఆదిలాబాద్ ఏఎస్పీ సురేందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైనథ్, బేల మండలాలతో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర ప్రజలకు రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. అందుకు జైనథ్, బేల సరిహద్దున గల రోడ్ల ద్వారా ఆదిలాబాద్‌కు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎస్పీ వెంట ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, జైనథ్ రూరల్ సీఐ డి.సాయినాథ్, జైనథ్ఎస్సై వి.పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయం

● దుర్గం ట్రస్టు చైర్మన్ శేఖర్ ● ఆదిలాబాద్‌లో సీఆర్ఆర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమం ● ఘన నివాళులర్పించిన నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 7: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, డీసీసీ ఉమ్మడి అధ్యక్షుడు అధ్యక్షుడు సి.రాంచంద్రారెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణంలోని చిల్కూరి లక్ష్మిగార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, అభిమానులు సీఆర్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. దుర్గం ట్రస్టు చైర్మన్, సీఆర్ఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరుగాంచిన దుర్గం శేఖర్ సీఆర్ఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని సీఆర్ఆర్ సోదరులు లక్ష్మీమరెడ్డితో కలిసి సీఆర్ఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా దుర్గం శేఖర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా సీఆర్ఆర్ అందరి అభిమానాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. ఆ మహానేత ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ జిల్లా అభివృద్ధికి పాటు పడాలని పిలుపునిచ్చారు. ఇందులో మాజీ టీపీసీసీ పప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, డీసీసీబీ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు ముడుపు దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్‌తో పాటు పలువురు నేతలు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, క్రీ.శే.చిల్కూరి రామచంద్రారెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. అనంతరం రాంచంద్రారెడ్డి చిత్రపటంకు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో సీనియర్ నాయకుడిగా రాంచంద్రారెడ్డి ప్రతీ రాజకీయ నాయకుడి మదిలో నిలిచారని కొనియాడారు.


సీఆర్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మావల: మాజీ మంత్రి చిల్కూరి రామచంద్రారెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం పార్టీల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ప్రజలు ఎన్నటికీ మర్చిపోరన్నారు. ప్రజల కష్టా సుఖాలను తెలుసుకుని అప్యాయంగా పలకరించే వారని కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు.


ఎంపీటీసీలను సన్మానిస్తున్న కాలనీవాసులు

'నిస్వార్థ సేవతోనే ప్రజల్లో గుర్తింపు'

ఇచ్చోడ, జూలై 7: పదవులు శాస్వతం కాదని.. అవి లేకున్నా ప్రజా సేవలో ఉంటూ వారి గుండెల్లో చిరస్థాయిగా నిలవడమే గొప్ప విషమయ ని అడేగామ(కె) పరిధిలోని కాలనీవాసులు అన్నారు. ఎంపీటీసీ కొత్తూరి సుజాత సభ్యురాలి ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో గ్రామస్థులు పాల్గొని అధికారంలో ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులు అందించిన సేవ ప్రజల్లో ఎప్పటికీ నిలబెడుతుందన్నారు. అడేగామ(కె) కాలనీలో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటుచేశారన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎంపీటీసీ కొత్తూరి సుజాతకు ఘనంగా సన్మానం నిర్వహిచారు. ఇందులో కాలనీవాసులు నల్ల ధర్మన్న, కొత్తూరి రమేష్, పెంట గంగన్న, ఎర్రన్న, సుభాష్, నర్సయ్య, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న 1986-87 బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇచ్చోడ, జూలై 7: ఇచ్చోడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1986-87 లో పదోతరగతి అభ్యసించిన విద్యార్థులు దాదాపు 38ఏళ్ల తర్వాత ఒక్క చోట కలిశారు. తమ జ్ఞాపకాలను, అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఆత్మీయ పలకరింపులు సరేసరి.. బాల్యస్మృతులను గుర్తుచేసుకుని మురుసిపోయారు. ఆదివారం ఈ ఆనందాలకు మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్ వేదికైంది. పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిన ఆ నాటి గురువులను ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. గురువుల నుంచి దీవేనలు అందుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా గడిపారు. ఇందులో ఉపాధ్యాయులు పురుషోత్తమరావు, కాజా మియా, నారాయణరెడ్డి, ప్రమీల పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్‌గా ఆదిలాబాద్ జట్టు

ఆదిలాబాద్ రూరల్, జూలై 7: రామోజీరావు జ్ఞాపకార్థం హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన రెండవ తెలంగాణ స్టేట్ కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారని జిల్లా అథ్లెటిక్స్ సెక్రటరీ రాజేష్ తెలిపారు. పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా జిల్లా జట్టు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు వీజీఎస్ రాకేష్, రాహుల్, సునంద పాల్గొన్నారు.

రెండు మద్యం దుకాణాల్లో చోరీ

ఆదిలాబాద్ రూరల్, జూలై 7: పట్టణంలోని రెండు మద్యం దుకాణాల్లో చోరీ ఘటనలు ఆదివారం వెలుగు చూశాయి. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుమల వైన్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ వైన్స్‌ల్లో దుండగులు షట్టర్లను పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. తిరుమల వైన్స్‌లో కేవలం మద్యానికి చోరీ చేసిన దుండగులు, బాలాజీ వైన్స్‌లో రూ.30 వేల వరకు నగదు అపహరించారు. బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు వేలి ముద్రలు ఆధారాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రాథమిక విచారణ చేపట్టారు.

నేటి నుంచి మొహర్రం ఉత్సవాలు

● మత సామరస్యానికి నిలయం రుయ్యాడి, తలమడుగు పీరీలు ● ఉత్సవాలకు ప్రజాప్రతినిధుల రాక


ఆలయంలో ప్రతిష్ఠించిన పీరీలు (ఫైల్)


ముస్తాబైన రుయ్యాడి హసన్ హుస్సేన్ ఆలయం

తలమడుగు, జూలై7: అమావాస్య తర్వాత కనిపించే నెలవంక రోజు నుంచి మొహర్రం ఉత్సవాలను ప్రారంభించేందుకు మండలంలోని తలమడుగు, రుయ్యాడి గ్రామస్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 8 నుంచి 18 వరకు పీరీల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు హస్సన్ హుస్సేన్ ఆలయాభివృద్ధి కమిటీ అధ్యక్షులు లోక భూమారెడ్డి తెలిపారు. తెలంగాణ సాంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీక పీరీల పండుగ. మతాలకతీతంగా జరుపుకునే తెలంగాణ ప్రజల పండుగ మొహరం. తలమడుగు, రుయ్యాడి గ్రామాలకు చెందిన పీరీల చరిత్ర వందేళ్లకు పైగా ఉంది. ఈ పండుగలో స్థానికులు చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ఆనందోత్సాహాల మధ్య పాల్గొంటారు. అంతేకాకుండా మొహర్రం పండుగ సందర్భంగా రుయ్యాడి గ్రామస్తులు పది రోజుల పాటు కాళ్ళకు చెప్పులు ధరించకుండా ఉంటారు. అలాగే మద్యం తాగకుండా భక్తిశ్రద్ధలతో ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ పండుగ జరుపుకోవడం వల్ల గ్రామంలో శాంతి సామరస్యాలతో పాటు మొక్కులు నెరవేరుతాయని గ్రామస్తుల ప్రగాఢ నమ్మకం. మొహర్రం పండుగరోజు నైవేద్యం మలీద ముద్దలు, పులి హోర వంటి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ పీరీల ఉత్సవాలను తిలకించేందుకు తెలంగాణ జిల్లాల నుంచి కాకుండా మహారాష్ట్ర జిల్లాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. పీరీలను తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం, నీటివసతి ఏర్పాట్లు చేశారు.

భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం..

● లోక భూమారెడ్డి, హస్సన్ హుస్సేన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు



రుయాడి పీరీలకు ఘనమైన చరిత్ర ఉంది. మొహర్రం పండుగకు రుయాడి గ్రామానికి పీరీలను తిలకించేందుకు తెలంగాణ ప్రాంతం నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. భక్తులు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా తగిన ఏర్పా ట్లుచేశాం. పండుగరోజున భారీ ఎత్తున అన్నదానం కార్యక్రమం చేపట్టనున్నాం. ఉత్సవాలకు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు రానున్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ఆదిలాబాద్ రూరల్, జూలై7: ఆదిలాబాద్ పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలను మరింత ముమ్మరం చేశారు. నెంబర్ ప్లేట్లు లేకుండా, సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలను ఆదివారం తనిఖీల్లో భాగంగా గుర్తించి సీజ్ చేశారు. దాదాపు 30కిలో పైగా వాహనాలను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించి వాటికి నెంబర్ ప్లేట్లు బిగించిన అనంతరం విడుదల చేశారు. కొందరు చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను నెంబర్ ప్లేట్లు లేకుండా తిప్పుతున్నారనే అనుమానంతో తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్సై ముబీన్ తెలిపారు.

పీజీహెచ్ఎంకు సన్మానం

ఆదిలాబాద్అర్బన్, జూలై7: వెంటాపూర్ గ్రామానికి చెందిన రూపావత్ గోవింద్ కోర్టికల్ ఆశ్రమ పాఠశాలలో పీజీహెచ్ఎం పదవీ విరమణ పొందగా ఆదివారం మినీ తనిషా గార్డెన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీఆర్టీయూటీజీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆడే నూర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నర్ర నవీన్ యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్‌లు పాల్గొని రూపావత్ గోవింద్‌ను శాలువాతో సన్మానించారు. ఇందులో రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్‌రాం, పరశురామ్, మోతీలాల్, శివలాల్, గోపాల్, మోహన్‌సింగ్, ప్రకాష్, విఠల్, గణేష్, శేఖర్, రంజిత్ సింగ్, మూన్‌సింగ్, ధనరాజ్, శ్రీనివాస్, శ్రీరామ్, ఉన్నారు.

అద్దె భవనంలో బీసీ వసతి గృహం

● వసతులు లేక వెనుతిరుగుతున్న విద్యార్థులు


రైతు శిక్షణ కేంద్రం పశు వైద్యశాలపైన నిర్వహిస్తున్న బీసీ హాస్టల్ భవనం ఇదే..


బోథ్‌లోని బీసీ బాలుర వసతి గృహం నుంచి వెళ్లిపోతున్న విద్యార్థులు

బోథ్, జూలై7: మండలకేంద్రంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బీసీ బాలుర వసతి గృహంలో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం గత మూడు సంవత్సరాల క్రితం బీసీ హాస్టల్ ఏర్పాటు చేశారు. అయితే హాస్టల్‌లో అప్పటి నుంచి పశు సంవర్ధక శాఖ వారి ఆధీనంలో ఉన్న భవనంలో నిర్వహిస్తున్నారు. అయితే విద్యార్థుల కోసం పశు సంవర్ధక శాఖ వారు ఇచ్చిన భవనంలో ఒక హాల్ మరోగది మాత్రమే ఉంది. అయితే విద్యార్థులు పడుకునేందుకు హాల్ ఉపయోగిస్తుండగా కిచెన్ రూమ్ స్టోర్ రూమ్ వార్డెన్ ఉండే గది ఒకే గదిలో ఉంది. దీంతో విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు సైతం లేవని అంటున్నారు. అయితే ఇటీవల హాస్టల్‌కు వచ్చిన నిర్మల్ జిల్లాకు చెందిన విద్యార్థులు సరైన వసతులు లేవన్న కారణంతో 9మంది విద్యార్థులు నిర్మల్ జిల్లాకు తిరిగి వెళ్లిపోయారు.

● నీటి వసతి లేదు


హాస్టల్‌లో ఉన్న బోరు బావికి భూగర్భ జలాలు లేకపోవడంతో విద్యార్థులు మూత్రశాలలను వినియోగించలేకపోతున్నారు. మరో వైపు అత్యవసర పరిస్థితుల్లో నీరు లేక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని విద్యార్థులు వాపోయారు. ఉన్న బోరు బావిలో కొత్తనీరు చేరకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది.

అద్దె గదులు దొరకడం లేదు

● చిన్నయ్య, వార్డెన్

విద్యార్థుల సంఖ్యకు సరిపడా అద్దెగదులు దొరకడం లేదు. ప్రభుత్వ పరంగా ఇచ్చే అద్దె తక్కువగా ఉండటంతో హాస్టల్ వసతి కోసం అద్దెకిచ్చేవారు ముందుకు రావడం లేదు. వేసవిలో బోరు బావిలో నీరు ఇంకిపోయింది. నీటి వసతి కోసం మిషన్ భగీరథ వారి ద్వారా నల్లా కనెక్షన్ తీసుకున్నాం. ప్రస్తుతం విద్యార్థులకు ఇబ్బందులు తగ్గాయి.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్టం 32.7 : కనిష్టం 25.4
నిర్మల్ జిల్లా వార్తలు
8
సోమవారం 8 జూలై 2024



అరుణాచలానికి ప్రత్యేక బస్సు : డీఎం

నిర్మల్‌కల్చరల్, జూలై7: జిల్లాకేంద్రం నుంచి సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరుణాచలానికి ఈనెల 19న ఆర్టీసీ బస్సు నడుపనున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 గురుపౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణ చేసే భక్తుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 19 మధ్యాహ్నం బయల్దేరి 20న వరాహ సిద్ధి వినాయక ఆలయం కాణిపాకం చేరుకుంటుందని, అక్కడి నుంచి తమిళనాడు వెల్లూర్ లక్ష్మీదేవి ఆలయ దర్శనం, సాయంత్రం అరుణాచలం చేరుకుం టుందదని పేర్కొన్నారు. 22న సాయంత్రం నిర్మల్ చేరుకుంటుందని తెలిపారు.



• తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు (ఫైల్)



• మామడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)

- బుట్టదాఖలైన అప్పటి కలెక్టర్ విచారణ నివేదికలు
- 2014 నుంచి 2018 వరకు అక్రమాల దందా
- రూ. కోట్ల విలువైన సర్కారు భూములకు ఎసరు
- విజిలెన్స్ విచారణపై కదలిక కరువు
- కొత్త కలెక్టర్‌పైనే ఆశలు

నకిలీ డీ-1 పట్టాలు, సేత్వారీలపై

చర్యలు కరువు!

నిర్మల్, జూలై7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2014 నుంచి 2018 సంవత్సరం వరకు యథేచ్ఛగా సాగిన డీ-1 పట్టాల అక్రమాలు అలాగే నకిలీ సేత్వారీల దందాపై చర్యలు కరువయ్యాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అప్పటి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నకిలీ డీ-1 పట్టాలు, సేత్వారీలపై వెల్లువెత్తిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. నకిలీ డీ-1 పట్టాలు, సేత్వారీలపై విచారణ జరిపేందుకు ఆయన ప్రత్యేక బృందాలను సైతం ఏర్పాటు చేశారు. అలాగే సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ నుంచి మొత్తం డీ-1 పట్టాలు, సేత్వారీలకు సంబంధించిన ఫైల్‌లను స్వాధీనం చేసుకొని విచారణ జరిపారు. దీనికి అనుగుణంగా ఈ వ్యవహారాన్ని విజిలెన్స్‌కు కూడా ఆయన అప్పజెప్పారు. అయితే అప్పటి అధికార బీఆర్ఎస్ నేతలు వారి బంధువులు, అనుచరుల హస్తం ఈ దందాలో ఉన్న కారణంగా అధికారులు చర్యలు తీసుకునేందుకు వెనకాడారన్న విమర్శలున్నాయి. నకిలీ డీ-1 పట్టాలు, సేత్వారీలపై విచారణలు జరపాలంటూ మామడ మండలంలోని న్యూసాంగ్వితోపాటు సిద్దిలకుంట తదితర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. వారంతా కలెక్టరేట్‌ను సైతం ముట్టడించి నిరసన తెలిపారు. భూకబ్జాదారులు వ్యూహాత్మకంగా ఈ భూములకు సంబంధించిన ఫైల్‌లను సైతం మాయం చేసి నకిలీ డీ-1 పట్టాలు, సేత్వారీలను సృష్టించారన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనికి అనుగుణంగా అప్పటి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నిజామాబాద్‌లోని ఎస్సారెస్పీ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో కూడా విచారణ జరిపించారు. అయితే ఈ డీ-1 అక్రమాల ముఠా మాఫియాను తలపించేలా అక్రమాల దందాను వ్యూహాత్మకంగా కొనసాగించిందన్న ఆరోపణలున్నాయి. పునరావాసా గ్రామాల్లోని కొంతమందిని ఎంపిక చేసి వారి పేరిట నకిలీ డి-1 పట్టాలను సృష్టించడమే కాకుండా సేత్వారీలను సైతం తయారు చేశారంటున్నారు. అయితే ప్రభుత్వ భూములను లక్ష్యంగా చేసుకోవడమే కాకుండా కొంతమంది ప్రైవేటు భూములపై సైతం గురి పెట్టారని చెబుతున్నారు. వందల కోట్ల విలువైన సర్కారు భూములనే వీరంతా డీ-1 పట్టాల పేరిట స్వాహా చేసినప్పటికి అప్పటి అధికారులు మాత్రం ఈ దిశగా పెద్దగా పట్టించుకోలేదంటున్నారు. కొంతమంది అధికారులు ఈ అక్రమాలకు అండగా నిలిచి బాధితులను బెదిరింపులకు కూడా పాల్పడినట్లు చెబుతున్నారు. దాదాపు నాలుగైదు నెలల నుంచి స్తబ్ధుగా ఉన్న నకిలీ డీ-1 పట్టాల వ్యవహారం మళ్లీ తెరపైకి వస్తోంది. ఇటీవల మామడ మండలంలోని న్యూసాంగ్వి గ్రామస్థులు తమ గ్రామంలో మౌలిక సౌకర్యాల కోసం కేటాయించిన భూమిని కొంతమంది అక్రమార్కులు నకిలీ డీ-1 పట్టాలు, సేత్వారీలతో కాజేశారంటూ ఆందోళనకు దిగడంతో మరోసారి ఈ వ్యవహారం తెరపైకి వచ్చింది. ఈ గ్రామస్థులంతా సంబంధిత తహసీల్దార్‌కే కాకుండా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. కాగా ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్‌కు కూడా పలువురు నకిలీ డీ-1 పట్టాలు, సేత్వారీల బాధితులు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ముక్కుసూటిగా వ్యవహరిస్తూ పకడ్బందీ పరిపాలన సాగిస్తున్న ప్రస్తుత కలెక్టర్ అభిలాష అభినవ్ నకిలీ డీ-1 పట్టాలు, సేత్వారీలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ తెరపైకి వస్తోంది. గత కలెక్టర్ స్వాధీనం చేసుకున్న రికార్డులపై మరోసారి దర్యాప్తు చేయించి భూమాఫియాపై ఉక్కుపాదం మోపాలని పలువురు కోరుతున్నారు.

రూ. కోట్ల సర్కారు భూములే లక్ష్యంగా..

గత 2014 సంవత్సరం నుంచి 2018 సంవత్సరం వరకు కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములను నకిలీ డీ-1 పట్టాలు, సేత్వారీల పేరిట కొంత మంది బడావ్యక్తులు స్వాహా చేశారంటున్నారు. ముథోల్, లోకేశ్వరం, నిర్మల్, లక్ష్మణచాంద, మామడతోపాటు తదితర మండలాల్లోని పునరావాస గ్రామాల్లో ఈ దందా పెద్దఎత్తున సాగిందని అంటున్నారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో ఉన్న ఎస్సారెస్పీ పునరావాస డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం అప్పట్లో పోచంపాడ్‌లో ఉండేది. అప్పటినుంచి మొదలైన ఈ దందా సంబంధిత కార్యాలయం నిజామాబాద్ వెళ్లిన నాటి నుంచి ఇప్పటి వరకు కూడా కొనసాగుతూనే ఉందని అంటున్నారు. అక్కడి కార్యాలయంలోని కొంతమంది సిబ్బంది ఈ అక్రమాలకు ఊతమిచ్చారన్న విమర్శలున్నాయి. పునరావాస గ్రామాలకు చెందిన కొంతమంది పేరిట భూములు కోల్పోయినట్లు చూపి వారి పేరిట తప్పుడు డి-1 పట్టాలను సృష్టించడమే కాకుండా జిల్లా అధికారులతో కుమ్మక్కై వాటిని నకిలీ సేత్వారీలు సైతం సృష్టించారని అంటున్నారు. అయితే ప్రభుత్వ భూముల విషయంలో ఎవరు పట్టించుకోకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. దీంతో పాటు వారు కొంతమంది ప్రైవేటు భూములకు సైతం పట్టాలు సృష్టించి నకిలీ సేత్వారీలతో ఆ భూములను కాజేసేందుకు ప్రయత్నిస్తుండడం వివాదాస్పదంగా మారుతోంది. అయితే ప్రస్తుత కలెక్టర్ అభిలాష అభినవ్‌కు కొంతమంది ఈ వ్యవహారంపై స్వయంగా ఫిర్యాదు చేయడంతో ఆమె ఈ దిశగా దృష్టి సారించబోతున్నారని అంటున్నారు. విధుల్లో నిక్కచ్చిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్ జిల్లాలో యథేచ్ఛగా సాగిన నకిలీ డి-1 పట్టాలు, అక్రమ సేత్వారీల వ్యవహారంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న అంశమే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారుతోంది.



• పట్టాలను రద్దు చేయాలని కోరుతూ కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న న్యూ సాంగ్వి రైతులు (ఫైల్)

అప్పటి అధికారులే కీలక సూత్రధారులు

నకిలీ డీ-1 పట్టాలు అలాగే నకిలీసేత్వారీల వ్యవహారంలో అప్పటి కొంతమంది అధికారులే ప్రధాన సూత్రధారులుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు సంబంధించిన ఓ అధికారి అలాగే ఇద్దరు సిబ్బంది మొత్తం ఈనకిలీ వ్యవహారంలో ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలున్నాయి. ప్రస్తుతం నకిలీ డీ-1 పట్టాల వ్యవహారంలో ఎవరిని అడిగిన ఈ అధికారి, సిబ్బంది పేరే బాహటంగా చెబుతుంటారన్నది బహిరంగ రహస్యమే. వీరూ 2014 సంవత్సరం నుంచి 2018 సంవత్సరం వరకు జిల్లాస్థాయిలో ఉన్న ఓ ఉన్నతాధికారి సహకారంతో ఈ వ్యవహారాన్ని దర్జాగా సాగించారని అంటున్నారు. అయితే జిల్లాలోని డీ-1 మాఫియా అధికారులను మచ్చికచేసుకొని రూ.కోట్లు విలువైన సర్కారు భూములను డీ-1 పట్టాల పేరిట స్వాహా చేసిందని అంటున్నారు. ఈ వ్యవహారంలో కోట్లలో చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. మొత్తానికి కలెక్టర్ అభిలాష అభినవ్ ఈనకిలీ డీ-1 పట్టాలు, నకిలీ సేత్వారీలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.



మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

గిరిజన కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి

నిర్మల్ కల్చరల్, జూలై7: గిరిజన కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కలిసి మోకుదెబ్బ నాయకులు వినతి చేశారు. గౌడ సంఘాల రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ తదితర నాయకులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గిరిజన కార్పొరేషన్‌కు రూ.5కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. నాయకులు సిద్ధిరాములుగౌడ్, ఏవీ బాలేశం, ముత్యం నర్సింలు గౌడ్, సురేష్ గౌడ్, ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.

తిమ్మాపూర్ మాజీ ఎంపీటీసీకి సన్మానం

భైంసారూరల్, జూలై7: మండలంలోని తిమ్మాపూర్‌లో ఎంపీటీసీగా ఐదేళ్లపాటు సేవలు అందించిన చాకేటి అశోక్‌ను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మీర్జాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ చాకేటి లస్మన్న, నాగులపల్లి రామారావు, రామేశ్వర్, రమేష్, నవీన్, గున్నాల రవి, భోజరాం పటేల్, తదితరులు ఉన్నారు.

'చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి'

పెంబి, జూలై7: బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10వ తేదీన తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి రాజేష్ తెలిపారు. ఆదివారం పెంబి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఎన్నికల సందర్భంగా బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. బీడీ కార్మికులకు రూ. 4వేల జీవనభృతి ఇవ్వడంతోపాటు రూ.10వేల కనీసపెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లన్నింటినీ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. ఇప్పటి ప్రభుత్వం బీడీ కార్మికులకు 4వేల పెన్షన్ గురించి కార్యాచరణ రూపొందించలేదన్నారు. ఈనెల 10న జరిగే కార్యక్రమానికి బీడీ కార్మికులు వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం లింగన్న, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

లఘుచిత్ర పోస్టర్ ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, జూలై 7: కిడ్నాప్ లఘుచిత్ర పోస్టర్ ఆదివారం నిర్మల్ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే. వినోదరావు ఆవిష్కరించారు. డాక్టర్ వేణుగోపాలకృష్ణ, బేబీ స్వాతి, శివ, సాయి నటించారు. గణేష్ దర్శకత్వం వహించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీపీ

తిట్టాడనే కోపంతోనే హత్య

- నిందితులందరూ మైనర్లే
- బైక్ లిఫ్ట్ ఇవ్వనందుకే గొడవ
- బైక్‌పై ఎక్కించుకొని హత్య.. తర్వాత మృతదేహం దహనం
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ జానకి షర్మిల



మీడియాకు వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల

బాసర/నిర్మల్, జూలై7: బైక్ లిఫ్ట్ నిరాకరించినందుకు తమను తిట్టాడనే పగతో ఆ వ్యక్తిని మైనర్లు పథకం ప్రకారం హత్య చేశారని ఎస్పీ డా. జానకి షర్మిల ఎస్పీ తెలిపారు. జూన్ 1న వెలుగుచూసిన ఈ హత్య ఉదాంతం కేసు వివరాలను ఆదివారం ఎస్పీ డా. జానకి షర్మిల ఎస్పీ కార్యాలయంలో వెల్లడించారు. జూన్ 1న బాసర రైల్వేస్టేషన్ సమీపంలో 90శాతం కాలిపోయిన మృతదేహం దొరకగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న బాసర పోలీసులకు దర్యాప్తు సవాలుగా మారింది. మృతదేహం పూర్తిగా కాలిపోవడం, ఘటనా స్థలం వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో కేసును ఛేదించడం క్లిష్టంగా మారింది. ముథోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై గణేష్ ప్రత్యేక బృందంగా ఏర్పడి సెల్‌ఫోన్ డాటా ఆధారంగా దర్యాప్తు చేసి నెలరోజుల తర్వాత కేసును ఛేదించారు. మృతుడు నిజామాబాద్ జిల్లా పకీరాబాద్‌కు చెందిన అర్జున్‌గా గుర్తించారు. జూన్ 1వ తేదీన మృతుడు అర్జున్ మహారాష్ట్ర ధర్మాబాద్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో టీ స్టాల్ వద్ద ఉన్న ముగ్గురు యువకుల్లో ఒకరి ఫోన్ అడుక్కొని ఫోన్ చేశాడు. ఆ తర్వాత బాసర వైపు వెళుతున్న ఆ ముగ్గురు యువకుల్ని అర్జున్ లిఫ్ట్ అడగగా అందుకు వారు నిరాకరించారు. దీంతో అర్జున్ తాగిన మైకంలో వారిని తిట్టాడు. తాగినమైకంలో తిట్టడంతో అక్కడ చిన్న గొడవ జరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకున్న ముగ్గురు మైనర్ యువకులు బైక్‌పై అర్జున్‌ని ఎక్కించుకొని బాసర రైల్వేస్టేషన్ సమీపానికి వచ్చారు. పథకం ప్రకారమే అర్జున్‌తో గొడవకు దిగి దాడి చేశారు. పక్కనే ఉన్న సెల్ టవర్ వద్దకు తీసుకెళ్లి పెద్దబండరాయిని మెడపై వేసి హత్య చేశారు. అనంతరం ముళ్లపొదలపై మృతదేహం వేసి నిప్పంటించి పారిపోయారు. సెల్‌ఫోన్ ఆధారంగా నేరస్తులను గుర్తించి ఆదివారం ఉదయం బాసర రైల్వేస్టేషన్ వద్ద బాసర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జరిగిందంతా పోలీసులకు వెల్లడించారు. నేరస్తుల నుంచి ఒక బైకు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని, సాంకేతిక ఆధారాలన్నీ సమర్పించి శిక్ష పడేలా ఆధారాలను సమర్పించినట్లు ఎస్పీ తెలిపారు. క్లిష్టమైన ఈ కేసును భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, ముథోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై గణేష్, జిల్లా ఐటీ కోర్‌టీం రామకృష్ణ, శ్రీనివాస్, నరేందర్, కిరణ్, రాజేశ్వర్‌లను ఎస్పీ అభినందించారు.



• వర్షానికి కోతకు గురైన నల్లుర్తి, దిమ్మదుర్తి రోడ్డు మార్గంలో గుంత

ఆదమరిస్తే అంతే..!

మామడ, జూలై 7: మామడ మండలంలోని దిమ్మదుర్తి నుంచి నల్లుర్తి వెళ్లే రోడ్డు మార్గంలో పెద్ద గుంత ఏర్పడడంతో ప్రయాణికులు వెళ్లాలంటే జంకుతున్నారు. త ఏడాది కురిసిన వర్షాలకు రోడ్డు మార్గంలో వాగు దగ్గర పెద్దగుంత ఏర్పడింది. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు చాలామంది అందులో పడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఇకనైనా అధికారులు వెంటనే స్పందించి ఆ గుంతను పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆదమరిస్తే చాలా ప్రమాదం ఉందని తెలిపారు.

బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలి

• ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు వెంటనే ఇంటి పట్టాలు ఇవ్వాలి: సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య

ఖానాపూర్, జూలై7: కేంద్రప్రభుత్వం ఇప్పటికైనా బొగ్గుగనుల వేలంపాటను వెంటనే నిలిపివేసి ఆ బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య డిమాండ్ చేశారు. ఖానాపూర్‌లోని సీఎంఆర్ గార్డెన్స్‌లో గత రెండురోజులుగా సీపీఎం పార్టీ నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతులకు ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొగ్గుగనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలంపాటను ప్రారంభించడం హేయమైన చర్య అన్నారు. బొగ్గు గనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే తర్వాత సింగరేణికి ఏమీ మిగలదని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థను బలహీనపరిచి నిర్వీర్యం చేసే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా వేలాన్ని అడ్డుకోకపోవడం సిగ్గుచేటన్నారు. సింగరేణి పట్ల కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలన్నారు. సింగరేణిని ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకోవడం కోసం రాష్ట్రప్రభుత్వం శాసనసభ తీర్మానాన్ని చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకున్న నిరుపేదలకు వెంటనే ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలన్నారు. ఇళ్లులేని వారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10లక్షలు అందజేసి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లాకార్యదర్శి గౌతమ్‌కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేష్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంఖు, లక్ష్మణ్, గంగామణి, సీపీఎం ఖానాపూర్ మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, జిల్లా నాయకులు పసివుద్దీన్, స్థానిక నాయకులు, తదితరులు ఉన్నారు.



అంబేద్కర్ నగర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

అణగారిన వర్గాల కోసం 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ పోరాటం

- త్వరలోనే ఎస్సీ వర్గీకరణ సాధించబోతున్నాం
- ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి బిక్కి మురళీకృష్ణ

ఖానాపూర్, జూలై7: అణగారిన వర్గాల కోసం 30ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ అలుపెరుగని పోరాటం చేస్తోందని ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి బిక్కి మురళీకృష్ణ అన్నారు. ఆదివారం ఖానాపూర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్‌లో, అంబేద్కర్ నగర్ కాలనీలలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఉచితంగా పండ్లను పంపిణీ చేశారు. అనంతరం గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటంలో ఎంతోమంది ఉద్యమ నాయకులు అసువులు బాసి అమరులయ్యారన్నారు. వారి త్యాగాలు వృధా పోవని త్వరలోనే మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ సాధించబోతున్నామన్నారు. కార్యక్రమంలో మాదిగ కుల సంఘ నాయకులు కుంటాల రాజన్న, ఖానాపూర్ మండల నాయకులు మంద హరీష్, కాంగ్రెస్ నాయకులు జన్నారపు శంకర్, శెట్టిపల్లి మోహన్, సంగర్తి ప్రవీణ్, జన్నారపు నరేందర్, శెట్‌పెల్లిశంకర్, మునుగురి దేవేందర్, కుంటాల నాగరాజు, కోరుట్ల ఆనంద్, జన్నారపు బద్రి, మనోజ్, మంద వంశీ, ఎంఈఎఫ్ నాయకులు జన్నారపు ప్రజ్యోతి, కోరుట్ల అశోక్, తదితరులున్నారు.

• ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

నిర్మల్ కల్చరల్: జిల్లాకేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంతోపాటు వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి శనిగారపు రవి ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కృష్ణమాదిగ నేతృత్వంలో రెండు తెలుగురాష్ట్రాల్లో అంటరాని తనం, అసమానతలు రూపుమాపి ఆత్మగౌరవ హక్కుల కోసం నినాదిస్తూ చేసిన దండోరా ఉద్యమమని అన్నారు. వర్గీకరణ ఉద్యమాన్ని చేపడుతూనే దివ్యాంగులు, వృద్ధులకు పెన్షన్లు పెంచేందుకు చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. నాయకులు కే.రాజు, దీపక్, శ్రీను, బాబు మాదిగ, తదితర నాయకులు పాల్గొన్నారు.

తానూర్: మండలంలోని హిప్నెల్లిలో ఆదివారం ఎంఆర్‌పీఎస్ 30వ ఆవీర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఎగరవేశారు. అనంతరం మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు సురేష్వాడ్ సాహెబ్రావు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులుగా గత 30 ఏళ్లుగా ఒక జాతి కోసమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల బహుజనుల కోసం తన జీవితాన్ని త్యాగం చేస్తూ ప్రతీ ఒక్కరి కోసం పోరాడుతున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్‌ఆర్‌పీఎస్ ముథోల్ మాజీ అధ్యక్షుడు సురేష్ మాదిగ, ఉమాకాంత్, గంగాధర్, చిన్నాలక్ష్మణ్, గంగాప్రసాద్, గిరిధారి తదితరులు పాల్గొన్నారు.



హిప్నెల్లిలో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం